# శ్రీ రమణ జ్యోతి

సంపుటి-43 సంచిక - 12 హైదరాబాదు డిసెంబరు, 2023 పేజీలు - 52 రూ. 10/- సంవత్సర చందా : రూ. 100/-

# SRI RAMANA JYOTHI

Vol - 43 Issue - 12 Hyderabad December, 2023 Pages - 52 Rs. 10/- Annual Subscription Rs. 100/-



BHAGAVAN SRI RAMANA MAHARSHI



*ARUNACHALA HILL* (అరుణాచల గిరి)

స్మరణమా త్రముననె పరముక్తి ఫలద । కరుణామృ తజలధి యరుణాచ లమిది ॥

శ్రీ రమణ జ్యోతి
డిశంబర్ 2023

**Sri Ramana Jyothi**
December 2023

ఈ సంచికలో ...

IN THIS ISSUE ...

| | | | |
|---|---|---|---|
| 1. | **డా॥ కే.యస్. గారి 113వ ప్రవచనం** | డా॥ వి. రామదాస్ మూర్తి | 3 |
| 2. | **శ్రీ భగవాన్ రమణమహర్షి స్మృతులు (శ్రీ దేవరాజ ముదలియార్)** | జి. శ్రీహరిరావు | 12 |
| 3. | **శ్రీ భగవాన్ నా జీవితంలోకి ఎలా ప్రవేశించారు?** | శ్రీ జి.కె. గోఖలే | 15 |
| 4. | **గణపతి నోట మాతంగి విద్య** | రేణుక అయ్యల సోమయాజుల | 22 |
| 5. | **శ్రీ రమణ మహర్షి భక్తాగ్రేసరులు** | మల్లాది ఫణిమాల | 26 |
| 5. | Be a Dheera | Dr K Subrahmanian | 30 |
| 6. | Ashtavakra Gita - 19 | V Krithivasan | 37 |
| 7. | The Incarnation of Sri Dakshinamurthy | Suri Nagamma | 40 |
| 8. | Universal Presence of Sri Bhagavan | | 45 |
| 9. | Gambhiram Seshayya | | 47 |
| 10. | Stories about Bhagavan | Sadhu Om | 50 |

## Events in Sri Ramana Kendram in December 2023

1. Satsang - Every Sunday - 9.00 - 10.45 a.m.
2. 1st - Punarvasu Satsang - 6.30 - 7.30 p.m.
3. 3rd Sunday - Meditation - 9.00 - 10.45 a.m.
4. 28th - Sri Bhagavan's 144th Jayanthi. The same will be celebrated in Kendram on Sunday 31st December.

(పాఠకులు దయచేసి తమ ఫోన్ నంబరు,e- మెయిల్ అడ్రెస్, శ్రీ రమణకేంద్రం ఆఫీసుకు వెంటనే ఫోన్ చేయగలరు)

(Readers are requested to kindly intimate the Sri Ramana Kendram Office, their Phone Number and e-mail address)

© Copyrights of all the material used from Sri Ramanasramam publications in Sri Ramana Jyothi either in excerpted form, translated form or serialised form totally belong to Sri Ramanasramam, Tiruvannamalai.

**శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు: కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్**
**(వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీరమణకేంద్రం)**

# వ్యక్తిత్వం లేనపుడు ఏకీకరణ

డా॥ కే.యస్. గారి 113వ ప్రవచనం

అనువాదం: డా. వి. రామదాస్ మూర్తి

సగటు మనిషికి రోజుకు రెండుసార్లు భోజనం, నిదురించ డానికి ఏదో ఒక ఇల్లు, ఈ రెండూ అవసరమని అనుకొంటాము. కాని కనీసం ఒక పూట భోజనం, వుండడానికి ఒక నీడ లేనివాళ్ళు ఎంతో మంది మన చుట్టూ ఎందరో వున్నారు. మనకూ, మన మధ్య తరగతి కుటుంబానికీ ఆ మాత్రం సౌకర్యం వుంటే సంతృప్తిగా వుండవచ్చు. కాని మనం ఎందుకు సంతోషంగా వుండము? అసలు కనీస అవసరాల కంటే కొద్దిగా అధికంగానే సగటు మనిషికి లభిస్తోందని చెప్పవచ్చు. కాని వున్న దాని కంటే ఎక్కువ వుండాలని ఎప్పుడూ భావిస్తాం. మన చుట్టుప్రక్కల వున్న వారి కంటే మనకు అధికంగా వుండాలని కోరుకుంటాం. ఆ ఉద్దేశంతో సంపాదించిన ఎన్నో వస్తువుల ద్వారా మన గౌరవం పెరుగుతుందని ఆశపడతాం. సేకరించిన వాటిలో ఎన్నింటిని మనం నిజంగా వాడుకుంటాం? ఇష్టపడి కొన్న వాటిలో చాలా వస్తువులను ఉపయోగించం కూడా. వచ్చిన వారి మెప్పు కోసం తప్ప కొన్ని సమయాలలో అలాంటివి మన దగ్గర వున్నాయని కూడ జ్ఞాపకం వుండదు. జీవితం అంతా ఏదో కారణాలతో అలాగ అనవసర వస్తు సేకరణలోనే సాగిపోతుంది.

బ్రహ్మచారిగా వున్నప్పుడు ఒక జీవిత భాగస్వామి వుంటే సుఖంగా వుంటామనిపిస్తుంది, పెళ్ళి చేసుకొనడం జరుగుతుంది.

క్రొత్తలో హాయిగా వున్నట్లుంటుంది. కాని సంబంధ బాంధవ్యాలతో వివాహం సమస్యలకు దారి తీస్తుందని తెలిసి వస్తుంది. మీ తల్లి తండ్రులతో భార్య నడవడిక, మీ అత్త మామలతో మీ సంబంధాలు, ఇబ్బందికరంగా మారవచ్చు. అలాంటి పరిస్థితి ఏర్పడవచ్చని తెలిసి నప్పటికీ, మీ విషయంలో ఇలాంటి యిబ్బందులు వుండవు, ఏదో కొందరి విషయంలోనే జరిగి వుండవచ్చునని సమాధాన పరచు కొంటారు. సమస్యలు ఏర్పడినప్పటికి అది కొద్ది కాలం మాత్రమే వుంటాయనుకొంటారు. జీవితంలో అలాంటివి సహజమేనని సర్దు కొంటారు.

పిల్లలు పుట్టుకు రావడంతో కొంత కాలం, వాళ్ళు యింకా చిన్నగా వున్నప్పుడు, మీ అదుపులో వుంటారు గనుక ఏ విధమైన సమస్య వుండదు. కాని అదే సమయంలో పిల్లలు ఆరోగ్యం సరిగా లేకపోతే, వాళ్లు నోరుతెరిచి చెప్పలేరు గనుక పరిస్థితిని ఎదుర్కొనడం కష్టమౌతుంది. వాళ్ళకు ఉపశమనం కలిగితే, తాత్కాలికంగా ఒత్తిడి తగ్గుతుంది. పిల్లలు కొంచెం పెరిగి పది, పన్నెండేళ్ళు వచ్చేసరికి మళ్ళీ సమస్యలు మొదలవుతాయి. కొడుకు, కూతుళ్ళ నడవడిక సరిగా వుందా అని ఆలోచిస్తారు. ఇంటికి ఆలస్యంగా వస్తే, వచ్చే దాకా చింత, ఆలోచన. తండ్రిలాగే తల్లికి కూడా అదే ఒత్తిడి. వాళ్ళ చదువులు, పెళ్ళిళ్ళు, అన్నీ ఒత్తిళ్ళకు కారణాలవుతాయి. కాని, ఎవరైనా వచ్చి యిబ్బందులు చెప్పుకుంటే, అబ్బే, ఏమీ ఫరవాలేదు, అన్నీ సర్దుకొంటాయని ఉపశమనం మాటలు చెబుతాము. వాటి వల్ల ఎదుటివారికి ఉపయోగం మాత్రం ఉండదు. అందరూ అగ్ని పరీక్షను ఎదుర్కోవలసిందే. కనుక ఇలాంటి విషయాలలో

ధనవంతులు కాని, పేదవారు కాని అందరికీ ఒత్తిడి తప్పదు. కాని ఇలాంటి ఇబ్బందులను ఎదుర్కొనేందుకు భగవంతుడు మనకు శక్తిని కలుగజేస్తాడు. ఒక ఆశ, ఒక నమ్మకము ఏర్పడుతూనే వుంటుంది. గట్టెక్కలేమోనన్న భయం వుండదు.

## మనసు పాత్ర

నమ్మకం అన్నది ప్రతి ఒక్కరిలో వుంటుంది. ప్రక్కరోజు ప్రొద్దున మళ్ళీ వస్తామన్న నమ్మకంతో రాత్రి నిద్రిస్తాం. లేకుంటే అది ఒక భయంకరమైన పరిస్థితి అవుతుంది. ఉదాహరణకు, ఎవ్వరో వచ్చి నీవు రేపు లేస్తావని నాకు అనిపించడం లేదు అన్నారను కోండి. ఇక ఆ రాత్రి నిద్ర వుండదు. అందరమూ పడుకొంటాం, మంచి నిద్ర పోవాలనుకొంటాం, తిరిగి లేవాలని కోరుకొంటాం. ప్రతి ఒక్కరమూ ఏదో విధంగా, ఒక చెప్పుకోదగిన వ్యక్తిని అనుకొంటాము - ఇంత డబ్బు వుంది, ఇంత మంది మనుషులు నా వాళ్ళున్నారు, శక్తిమంతుడిని అనుకొంటాము. నిద్రకు సంబంధించిన ఒక అసాధారణమైన విషయమేమంటే, మీరు తీవ్రమైన జబ్బుతో బాధపడుతున్నప్పటికీ, గాఢనిద్రలో మాత్రం బాధతీవ్రతను, మనస్సును గురించిన ఏ ధ్యాస కూడ వుండదు. క్యాన్సర్ జబ్బు వల్ల ఎంతో బాధలో వున్నప్పటికీ, స్పృహలో లేనందు వల్ల నొప్పి నిద్రలో తెలియదు. ఆత్మ లేదా హృదయము నుండి మనసు బయటపడినప్పుడు మళ్ళీ నొప్పి తెలుస్తుంది. మనసు లేనప్పుడు నొప్పి వుండదు. మనసు మేల్కొన్నప్పుడు, శరీర స్పృహ వస్తుంది, నొప్పి మొదలవుతుంది.

మనసు చురుకుగా పనిచేయడం వల్లనే మనకు అన్ని సమస్యలు ఉత్పన్నమవుతాయి. గాఢనిద్రలో, ప్రపంచం, మనసు, శరీరం, ఇవేవీ ఎఱుకలో వుండవు. మంచి నిద్ర అంటే, కలలు ఏవీ లేకుండ, మనసు తెలియని స్థితిలో వుండడం, మనసుకు సంబంధించిన స్పర్థలేమీ లేకపోవడం. అహం వున్నప్పుడు, మనసు చురుకుగా వున్నప్పుడు, స్పర్థ ఏర్పడుతుంది. అంటే మనసును చంపమని ఉద్దేశమా? కాదు. అవగాహనకు సంబంధించినది. నీకు ''నేను ఎవరు'' అన్నది అవగాహనలోకి వస్తే, మనసు పని చేసే తీరు మారుతుంది.

మరో విధంగా చెప్పాలంటే, నాకు ఈ ప్రపంచంలోని ఎన్నో విషయాలను తెలుసుకోవాలని వుంటుంది. దాని వల్ల ఒత్తిడికి, గందరగోళానికి దారి తీస్తుంది. నాకు బాహ్యమైన పలు విషయాలను తెలుసుకోవాలన్న తాపత్రయం. నేను ఒక విషయజ్ఞుడనని, పండితుడి నన్న భావన కలుగుతుంది. అంతటితో ఆగక మరొక రంగంలో నిష్ణాతుడినని అనిపించుకోవాలన్న ఆదుర్దా మరొక వైపు. ఎవరో మన విజ్ఞానాన్ని అవగాహనను గురించి అది సరియైనదని కాదని వాదిస్తే మనం సమర్థించుకోవాల్సి వస్తుంది.

## గుర్తింపు ముఖ్యమా?

మరింత ధనం, ఎంతో ఎక్కువ విజ్ఞాన అవగాహన, పాండిత్యము, సంపాదించుకొంటే, ఇతరులు మెచ్చుకొంటారని అనుకొంటాము. విధాన సభ లేదా పార్లమెంటు సభ్యులుగా వుండవలసిన అవసరం లేదు. రాజకీయవేత్తలు, యితరులు మీ

వద్దకు వస్తారు. ధనబలంతో పనులు చేయించుకోవచ్చు. కాని ఏదో పలుకుబడి, దానివల్ల లభించే శక్తి కోసం అలాగ వుండడం ఎందుకు? మనకు గుర్తింపు కావాలి. మనసు గుర్తింపు కోరుకొంటుంది. గుర్తింపు లేకుంటే సంతోషంగా వుండదు. కోరికలు ఎక్కువయ్యే కొద్ది, సమస్యలూ ఎక్కువవుతాయి. మనం సమాజంలో ఒక ప్రముఖ వ్యక్తిగా చెలామణీ కావాలని ఆశిస్తాము. ఈ ధోరణిని గుర్తించి జాగ్రత్త పడాలి.

యయాతిని వెంటనే వృద్ధుడిని అయిపొమ్మని శుక్రాచార్యుడు శపించిన ఉదంతం మీకు తెలిసే వుంటుంది. తనను క్షమించమని, తిరిగి మునుపటి వయసు, వ్యక్తి లాగ చేయమని శుక్రాచార్యుడిని ఎంతో వేడుకొన్నాడు. శుక్రాచార్యుడు దానికి అంగీకరించక నీకు ఆరుగురు కొడుకులు వున్నారు కదా! వాళ్ళలో ఎవరినైనా నీ వృద్ధాప్యాన్ని తీసుకుని తన వయసును తిరిగి యివ్వమని అడగ మన్నాడు. కొడుకులను అలాగ కోరినప్పుడు ఆఖరి పుత్రుడు తప్ప మిగిలిన ఎవ్వరు అలా చేయడానికి అంగీకరించలేదు. తన వయసును తండ్రి తీసుకొని కొంత కాలం, అనుభవించమని ఆఖరి కొడుకు ఒప్పుకొన్నాడు.

మహాభారతంలోని ఈ ఉదంతంలో ఒక చక్కని శ్లోకంలో యయాతి యిలా అంటాడు. నీ యౌవనాన్ని నేను తీసుకున్నప్పుడు దానిని పూర్తిగా అనుభవించానని భావించే సమయం వస్తుందను కొన్నాను. యౌవనాన్ని అప్పుడు మళ్ళీ నీ యౌవనాన్ని నీకు యిచ్చేయ వచ్చుననుకొన్నాను. కాని ఎన్నో ఏళ్ళు గడిచినప్పటికీ, యిక చాలును

అన్నది అనుకొనే స్థితి చేర లేకపోతున్నాను. దీనికి అంతు లేదు. ఈ అనుభవంతో కోరికలను తీరుస్తూ పోతుంటే, సంతృప్తి అన్నది కలుగదు. అనుభవిస్తుంటే, మరిన్ని కోరికలు పుట్టుకొస్తూనే వుంటాయి. కోరికలను తీరుస్తున్న కొద్దీ, మంటల్లో నేతిని పోసినట్లు అవి మరింత ఎక్కువ అవుతూ పోతాయి. అందుకే అలా చేస్తూ పోవడంలో అర్థం లేదు. ఒక హద్దును ఏర్పరచుకోవాలి అని బుద్ధుడు అన్నాడు.

ధనాన్ని సంపాదించడం అవసరమే కాని ఏదో గొప్పవాడిని అవుతానని అలాగ పోగు చేస్తూ పోవడం మంచిది కాదు. నీవు కోరకుండ వస్తే, దానిని వద్దనకు, పేదలకు ఇవ్వడం మంచిది. మనం చేసే ఖర్చులు అనవసరమైనవి వుండరాదు. దానిని పాటించడం వల్ల కొంత అవసరమైన వారికి ఇవ్వగలుగుతాం.

**విధి నిర్వహణ**

ఇక మన విధి నిర్వహణ గురించి చెప్పాలంటే, విధులను సక్రమంగా శక్తి మేర నిర్వర్తించాలి. కొన్ని సందర్భాలలో ఏవో యితర యిబ్బందులు లేదా, ఏకాగ్రత లోపం వల్ల విధులు సరియైన రీతిలో చేయలేక పోవచ్చు. ఇతరులు మెచ్చే లాగ చేయలేమేమో అనుకున్నది విఫలమవుతుందేమో అన్న ఆలోచనలు రావచ్చు. అందుకే యితరుల మెప్పుదల గురించి ఆలోచించక శక్తిమేర తమ పని ఏస్తే అందులో కృతకృత్యులవుతారు.

గాంధీజీ తెల్లవారక ముందే మూడు గంటల నుండి రాత్రి తొమ్మిదింటి వరకు అరగంట తప్ప తమ కార్యక్రమాలను నిర్వర్తించే

వారు. ఏళ్ళ కొద్దీ అలా చేస్తూ వారాంతపు విశ్రాంతి అన్నది తెలియక చేసేవారు. ఆయనకు ఏ దిగులూ వుండేది కాదు. కారణం తానొక పనిముట్టునేనని, విజయాపజయాలు భగవంతుని చేతిలో వుంటాయని భావించేవారు. శక్తిమేర పని చేయడం తమ కర్తవ్యమని ఒత్తిడి లేక వుంటుందనేవారు.

అధ్యాపక వృత్తి మరే యితర వృత్తిలో గాని, కొన్ని సమయాల్లో బాధ్యత సరిగా నిర్వర్తించామని, మరికొన్ని సార్లు అలాగ చేయలేక పోయామని అనిపిస్తుంది. మన యొక్క కర్మ ఫలితాలపై మనకు అదుపు వుండదు. మా ఫలేషు కదాచన (భ.గీ.)

కోరికలుండడం మానవ సహజమని భగవాన్ అంటారు. కాని అదే సమయంలో అలాగ కోరుతున్న వారెవరో తెలుసుకొమ్మని అంటారు. మనం ఎల్లప్పుడూ బాహ్యదృష్టిలో వుంటాము. లో దృష్టితో గమనించాలని వారు అంటారు. ప్రార్థన, జపం, ధ్యానం సహాయంతో అంతర్ముఖులైతే, భగవత్ కృపతో, వ్యక్తిత్వముందను కొనే మనసు ఆత్మలో లీనమై, నీవు శుద్ధ చైతన్యమని తెలియ వస్తుంది. నీ వ్యక్తిత్వం పూర్తిగా నశిస్తుంది.

వశిష్ఠులవారు శ్రీరామచంద్రునికి ఇచ్చిన సలహాలో ''రామా! బాహ్యంగా నీవు యితరుల వలే సాధారణంగా ఉత్సాహవంతునిగా లోకరీతిలో అగుపడు. కాని అంతరంగంలో నీవు ప్రశాంతతో నెమ్మదిగా వుండు. లోకే విహార రాఘవ. ఈ ప్రపంచంలో నీవు లీలగా పాత్రను పోషించు. నీవు నిజంగా ఎవరో నీకు తెలుస్తుంది. నీవు అహంకారపూరితమైన మనసు కాదు, శుద్ధ చైతన్యం. నీవు

దేహధారివి గనుక యితరుల కోసం నీవు ఆ విధంగా నడుచుకోవాలి. నీవు కూడ ఒక సాధారణ వ్యక్తివని యితరులు నమ్మాలి. నీవు ఒక ప్రత్యేక పాత్ర పోషించడానికి వచ్చావు గనుక, అంతరంగంలో శాంతి సుస్థిరంగా వుంటుంది. రాఘవా! నీవు అలాగ వ్యవహరించాలి" అని అన్నారు.

**పాత్ర వరకు పరిమితం**

నాటకంలో ఒక దుర్యోధనుని పాత్ర ధరించి వేదికపైకి వచ్చి దుర్యోధనుని వలె ఒకరు నటిస్తారు. అతని నటనా సామర్థ్యం వల్ల ప్రేక్షకులను మెప్పిస్తాడు. తాను దుర్యోధనుడిని కానని అతనికి తెలుసు. నిజ జీవితంలో కూడ అలాగే నటించి శక్తి కొలది మనం చేయాల్సినది చేయాలి. మన నిజ స్వభావాన్ని తెలుసుకొన్నప్పుడే అలాగ ప్రవర్తించడం సాధ్యమవుతుంది.

ఇదంతా ఏదో సూత్రప్రాయంగా చెప్పేది మాత్రమేనని మీలో కొందరు అనుకోవచ్చు. ఎంతో ధనమూ, అధికారం వున్న వాళ్ళు కొందరు, లౌకికంగా ఏ అధికారం, స్థానమూ లేని నిజమైన సన్యాసుల వద్దకు శాంతి కోసం వెళ్ళి ప్రార్థిస్తాం. అది మనకు లేనిది, వారి వద్ద లభించేది. అతి సాధారణమైన జీవితాన్ని గడిపే వాళ్ళు ఒక పూట భోజనంతో తృప్తి చెందుతారు. మనం వర్ణించలేని ప్రశాంతతను అనుభవిస్తుంటారు. వాళ్ళతో మాట్లాడడానికి కాదు, వారి దర్శనం కోసం మనం వెళ్తామని అనుకోవచ్చు. మాటలే అవసరం లేని స్థితిలో తాము అనుభవించే శాంతిని మనపై కూడ

ప్రసరింప జేస్తారు.  మన యొక్క మనసు వంటిది లేని శుద్ధ చైతన్యం వాళ్ళ సొత్తు, అప్పుడు మాధ్యమంగా సంభాషణ అవసరం లేదు. ఆ పరిస్థితుల్లో లభించే శాంతి ఆత్మలో మనసు లీనమైన కారణంగా ఏర్పడినది. మనలాగ వాళ్ళు వ్యక్తులనడానికి వీలు లేని చైతన్యస్థితిలో ఆనందపడుతున్నారు.

చైతన్యం ఏకత్వాన్ని ప్రోత్సహిస్తుంది. మనసు మనుష్యులను విడదీస్తుంది. మనసు ఒక ఆలోచనల సముదాయం అనుకుంటే, యిద్దరిలో వున్న ఈ ఆలోచనా సముదాయంలోని భేదం వల్ల ఒకరు ఎదుటివారికి భిన్నంగా వున్నట్లు తోస్తుంది. కాని వ్యక్తిత్వ ధోరణి గాని, అహం భావన, లేనప్పుడు ఏకీకరణ జరుగుతుంది. జ్ఞాని యొక్క స్వభావం అదే. అంటే జ్ఞాని శాంతిని మాటలను మాధ్యమంగా ఉపయోగించుకొనే అవసరం లేకుండ ప్రసాదించ గలడు. మునులు అంతర్దృష్టి ప్రాముఖ్యతను చెబుతూనే వున్నారు. లోనికి చూడడం ఎక్కువయ్యే కొద్దీ, కోరికలు, ఆశించడం తగ్గుతాయి. కర్తవ్యాలను సమర్థవంతంగా నిర్వహించగలం. విజయం లభించినంత మాత్రాన పొంగిపోవడమంటూ వుండదు. ఓటమితో క్రుంగి పోవడమూ వుండదు. జపం, ధ్యానం, పూజల ఫలితంగా మన కార్యక్రమాలు సాగుతున్నప్పటికీ ఒక వైపు ప్రశాంతత చోటు చేసుకుని వుంటుంది. మన ప్రయత్నాలకు తోడుగా భగవత్కృప అంతర్లీనంగా వున్నప్పుడు వర్ణనాతీతమైన శాంతిని అనుభవిస్తూనే వుంటాం.

# శ్రీ భగవాన్ రమణమహర్షి స్మృతులు
## (శ్రీదేవరాజ ముదలియార్)

(గత సంచిక తరువాయి) అనువాదం: జి. శ్రీహరిరావు

1952 జనవరి 13వ తారీఖున, మద్రాసు రమణ భక్త సభలో శ్రీ జగదీశ శాస్త్రి గారు ఉపన్యసించారు. ఒకసారి, మృత్యు ముఖంలో ఉన్న వారిని శ్రీ భగవాన్ రక్షించారు. ఆయన మాట్లాడుతూ "శ్రీ భగవాన్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని, వారు సమాధి చెందే మూడు రోజుల ముందు నేను ఆశ్రమానికి వెళ్ళాను. చచ్చిపోయే నన్ను మీరు బ్రతికించి, ఒక కొత్త జీవితాన్ని ప్రసాదించారు. మీరు తలుచుకుంటే, మా అందరి కోసమూ మీరు ఇంకొంత కాలము జీవించాలి" అని ప్రార్థించాను. "ఈ మాట చెప్పటానికా నీవు అంత దూరం నుండి వచ్చావు? ఈ దేహమే మనకు పెద్ద భారము. ఈ భారాన్ని పొడిగించాలనే ఆరాట మెందుకు?" అన్నారు శ్రీ భగవాన్ అని తెలియచేశారు. శ్రీ భగవాన్ వంటి జ్ఞానులందరూ యీ దేహం ఒక భారమనీ, దానిని వదిలించు కోవాలనీ భావిస్తారు.

శ్రీ శాస్త్రిగారితో జరిగిన ఈ సంభాషణకు చాలా ముందే, శ్రీ భగవాన్ ఈ విషయాన్ని గురించి మాతో చర్చించారు. "కట్టెల అడితికి వెళ్ళారనుకోండి. కొన్ని కట్టెలు కొని, అవి మోసుకు రావడానికి ఒక కూలీని పెట్టుకుని తీసుకు వెడతారు. అతనితో బాటూ మీరు నడుస్తూ వుంటారు. ఎంత త్వరగా గమ్యాన్ని చేరుకొని, ఆ భారాన్ని వదిలించుకోగలనా అని ఆ కూలీ ఆలోచిస్తుంటాడు. అదే విధంగా జ్ఞాని తన దేహాన్ని వదిలించుకునే ప్రయత్నంలో

ఉంటారు, దేహం ఉన్నదా, లేదా అన్న స్పృహ కూడా ఉండదు జ్ఞానికి'' అని వివరించారు శ్రీ భగవాన్.

ఈ సంగతి చెబుతూ ఒక సంస్కృత శ్లోకాన్ని ఉదహరించారు శ్రీ భగవాన్. మా కోసం శ్లోకాన్ని తమిళం లోనికి అనువదించారు. శ్లోకసారాంశమిది:

''మద్యపానం మత్తులో ఉన్న ఒక
మనిషికి వంటిపై బట్ట ఉన్నదా
లేదా అన్న స్పృహ లేనట్టే, జ్ఞానికి
దేహ స్పృహ ఉండదు''.

ఈ సందర్భంలో శ్రీ భగవాన్ చెప్పిన ఒక హాస్యభరిత మయిననూ, ప్రగాఢమైన సత్యము గుర్తుకు వస్తున్నది:

శ్రీ భగవాన్‌కు మందులు వేసుకోవడం ఎప్పుడూ ఇష్టం వుండేది కాదు. దానికి మంచిదనీ, దీనికి మంచిదని మేమే వారిని బలవంత పెట్టే వారలము - ముఖ్యంగా వారి కాలి కీళ్ళనొప్పుల కోసం. శ్రీ భగవాన్ ''ఈ దేహమే పెద్ద జబ్బు. ఈ జబ్బును పొడిగించుకోవ డానికి ఎవరైనా మందులు వాడతారా?'' అని జవాబిచ్చేవారు.

అయినా గానీ మా బలవంతం మీద, ఆ మందులు కొద్ది రోజులు వాడి తరువాత మానేశారు. చేతిమీద పుండుకు ఇంకో రెండు ఆపరేషన్లు చేశారు. ప్రతి ఆపరేషను తరువాత పుండు ప్రమాణమూ, తీవ్రతా ఇంకా పెరుగుతూ వచ్చాయి. ఈ బాధా సమయంలో శ్రీ భగవాన్ ఒక్క విషయం గురించి మాత్రము గట్టిగా వుండేవారు. ఉదయం, సాయంకాలము భక్తులకు తమ దర్శనానికి

ఆశ్రమ అధికారులు అడ్డు రాకూడదని శ్రీ భగవాన్ పట్టుదల.

వారు ఆ జబ్బుతో బాధ పడుతున్నప్పుడు నేను ఇదివరకులాగా, సన్నిహితంగా ఉండటంగానీ, దీర్ఘంగా సంభాషించడం గాని సహజంగానే సాధ్యమయ్యేది కాదు. కానీ, రోజుకు రెండుసార్లు వారి దృష్టి నాపై పడేది. నాకదే చాలు. అనేక మంది ఇతర భక్తులు కూడా అలాగే భావించేవారు.

తన పరిస్థితి ఎంత ప్రమాదకరంగా వున్నూ, యితరులపట్ల శ్రీ భగవాన్ కుండే సానుభూతీ, ఆదరణా యీ సంఘటనల వల్ల తెలుస్తాయి. వారికి జరిగిన ఆఖరి ఆపరేషన్‌కు ఒక వారం ముందు, మద్రాసు నుండి చాలా మంది డాక్టర్లు వచ్చి ఆయనను పరీక్షించారు. ఆపరేషన్ అవసరమా, లేక మానివేయ వచ్చునా అని వారు నిర్ణయించాలి. డా. గురుస్వామి ముదలియారు గారు కూడా, వారితో బాటు వచ్చారు. వారెలాగైనా, శ్రీ భగవాన్‌ను శస్త్రచికిత్స లేకుండా, మందులతో నయం చేయగలుగుతారనే కొద్ది ఆశ నాలో మెదులుతూ ఉన్నది. దాదాపు పదిహేనుమంది డాక్టర్లున్నారు. వారిలో చాలామంది శ్రీ భగవాన్ భక్తులు. వాళ్ళందరూ శ్రీ భగవాన్‌ను చూడటానికి కొత్త హాలులోనికి వెళ్ళారు. డాక్టర్లు తప్ప యితరులెవరూ లోనికి వెళ్ళలేదు. నేను కూడా వెళ్ళలేదు. బయటే నిలబడివున్నాను. నేను లేకపోవడం గమనించి, ''దేవరాజ ముదలియారెక్కడ?'' అని అడిగారట శ్రీ భగవాన్.

(ఈ రచన శ్రీ రమణాశ్రమము ద్వారా ప్రచురింప బడిన 'మై రికలక్షన్స్ ఆఫ్ భగవాన్ శ్రీ రమణ మహర్షి' అనబడే గ్రంథము నుండి అనువదింపబడినది.)

# శ్రీ భగవాన్ నా జీవితంలోకి ఎలా ప్రవేశించారు

శ్రీ జి.కె. గోఖలే

ఇంచుమించు 1985 సం॥లో మా మిత్రులు తోటి సాధకులు శ్రీ యాదయ్యగారు, నేనూ ఒక రాష్ట్రీయ సంస్థలో పని చేసేవారం. అప్పుడు నన్ను వారు డా. కె.ఎస్.గారికి పరిచయం చేశారు. సామాన్యులకు ఏవో కష్టాలు వుంటాయి. తెలియందేం కాదు నాకు వ్యక్తిగతంగా కొన్ని సమస్యలు వుంటూ వచ్చాయి. యాదయ్య గారికి, నాకు సత్సంగం జరిగేది రోజూ. ఒక అరగంట నుండి 1 గంట పాటు జరిగేది. అదీ మధ్యాహ్న భోజన విరామంలో ఆఫీసు లోని సమస్యలు, వ్యక్తిగత సమస్యలు, కొద్దికొద్దిగా చర్చించు కొనేవాళ్ళం. భావ ఐక్యత వున్న వాళ్ళం ఒక చోట కలుస్తాము అని యాదయ్యగారు ఒక రోజున చెప్పటం జరిగింది. డా. కె.ఎస్. అని సీఫెల్‌లో ఒక ప్రొఫెసర్ వున్నారు. మీరు నాతో వస్తే తమకు అభ్యంతరం లేదని అన్నారని చెప్పారు. ఆఫీసు సమయమయ్యాక యాదయ్య గారి బండిపై వారితో పాటు వెళ్ళే వాడిని.

నేను మొదట ఆయనను చూడగానే దాదాపు నాన్న గారి లాగ వున్నారు. పొట్టిగా ఎప్పుడూ నవ్వుతూ కనిపించేవారు. యాదయ్య గారు నన్ను పరిచయం చేశారు. వీరు గోఖలే గారు ఒకే ఆఫీసులో ఇద్దరం చేస్తున్నాము అని పరిచయం చేస్తే వారు చిరునవ్వుతో పలకరించారు. సత్సంగానికి వస్తూ వుండండి అని చెప్పారు. నాకు వీలును బట్టి అలా పోతుండే వాళ్ళం. ముందుగా

నేను చెప్పినట్లుగా నాకు ఆర్థిక సమస్యలు కొంత ఎక్కువగా వుండేవి. నేను మొత్తం జీతం తీసుకోలేదు. నా తక్కువ జీతంతో పాటు యితర చిన్న చిన్న పనులు చేస్తూ కొంత మొత్తం సమకూర్చుకునే వాడిని. వీలయినంత వరకు సత్సంగాలకు వెళ్ళే వాడిని. అయితే కె.ఎస్. గారు మొట్ట మొదట కలిసేవారి పోస్టల్ అడ్రస్ అడిగి తీసుకునేవారు. అలా వారు భక్తులకు తమ వీలును బట్టి వారి సందర్భాన్ని బట్టి పోస్టు కార్డు రాసేవారు. సమస్యకు పరిష్కారం లభించేలా చిన్న ఓదార్పులా వుండేది. వారు ఎక్కడ వున్నప్పటికీ కూడా వారు భక్తులకు ఇలా రాసేవారు ఉదా. నేను పెద్ద ఆర్థిక సమస్యలో బాధ పడుతుంటే ఒక ఉత్తరం వచ్చేది. దానిలో "He knows Best what you Need" అని వచ్చేది. ఆ సమస్య తీరిపోయేది.

ఆ రోజుల్లో కేంద్రానికి వస్తూ వుంటే చాలా ఆనందంగా వుంటూ వుండేది. ఎండాకాలం, వానాకాలం, చలికాలం అంటూ ఏ కాలంతో సంబంధం అయినా లేకుండ కేంద్రానికి రావటం జరిగేది. వానాకాలంలో సత్సంగానికి 50 నుండి 60 మంది వచ్చేవారు. ఒక్కసారి చాలా పెద్ద వర్షం పడింది. అప్పుడు కె.ఎస్. గారు, యాదయ్యగారు, రమణయ్యగారు, రాజేశ్వర్ గారు, మోహన రావు గారు అందరూ వచ్చేవారు. తక్కువ మంది ఉన్నప్పుడు కూడా కె.ఎస్.గారు ప్రవచనం చేసేవారట. నేను కొన్నిసార్లు వెళ్ళలేక పోయినపుడు యాదయ్యగారు ప్రతిరోజు ఆఫీసులో చెప్పేవారు. మీరు ఎంత మంది వచ్చేవారు అన్నది కాదు. భగవాన్ ఫోటో అక్కడ

పెట్టి అగరుబత్తి వెలిగించి, అరుణాచల శివ అని చెప్తే చాలు సత్సంగం అయిపోయినట్లే ఇద్దరు, ముగ్గురు అని సంబంధం లేదు అది సత్సంగంతో సమానం అని కె.ఎస్. చెప్పే వారట.

ఆ రోజుల్లో పుస్తకాలను ఒక ట్రంక్ పెట్టె లాంటి దానిలో పెట్టుకునే వాళ్ళం. సత్సంగం మొదలైన వెంటనే దానిలోని పుస్తకాలు తీసుకొని ఎవరికైనా అవసరం అయిన భక్తులకు ఇవ్వటం జరుగుతుండేది. అది యాదయ్య గారు చేస్తూ వుంటే నేను సహాయపడేవాడిని. దీని నంతటిని రమణయ్యగారు పర్యవేక్షించే వారు. ఏది ఎలా చేయాలో చెప్పేవారు. కానీ నాకు మాత్రం రమణయ్య గారితో మాట్లాడాలంటే కొంచం భయంగా వుండేది. గౌరవంతో కూడిన భయం. ఎందుకంటే ఆయన చాలా క్రమబద్ధతతో వుండేవారు. అప్పుడు చిరుకాల భక్తులైన మల్లయ్యగారు, శ్రీనాథ్‌గారు, రాజేశ్వర్ రావు గారు వీరందరూ వచ్చేవారు.

అయితే మల్లయ్య గారి గురించి నేను ఒక మాట చెపుతాను. కృతజ్ఞతా భావం తెలియచెప్పాలి. వారు ఎంతో విశాల హృదయం కలవారు, సౌమ్యులు, ఎవరు ఏ కష్టంలో వున్నారో అని ముఖాన్ని చూసి గమనించేవారు. కె.ఎస్. గారి తర్వాత ఆయనే అలా గమనించగల భక్తులు. మా ఆఫీసును మూసి వేయడం జరిగింది. దాంతో నాకు చాలా కష్టం వచ్చింది. పెద్ద కుటుంబం. ఒకసారి ఆర్థిక ఇబ్బందులను తలచుకుని నేను, నా భార్య సత్సంగంలో

ఇద్దరం కళ్ళనీళ్ళు పెట్టుకున్నాం. సత్సంగం అయిన తర్వాత మల్లయ్యగారు మమ్మల్ని ఇద్దరినీ పిలిచి ఏమైంది అని అడిగి వెంటనే మీ పిల్లలతో పాటు మా యింటికి తప్పకుండా రండి అని ఎంత ప్రేమగా పిలిచారు. వీలు చూసుకొని అందరం ఒకసారి వెళ్ళాము. వారు మమ్మల్ని వారి గదిలోనికి తీసుకెళ్ళారు. అది ఒక చిన్న ధ్యాన హాలుగా వుండేది. అక్కడ భగవాన్ ఫోటోలు అన్ని రకాలవి వుండేవి. వారి వద్ద ఒక చిరుతిండి తీసుకున్న తర్వాత వారు ఇట్లా చెప్పారు. ''అమ్మా, మీకు నేను ఒక సాయం చేయదల్చుకున్నాను. ఇది సాయం కాదు భగవాన్ ప్రసాదంగా ఇస్తున్నాను. అని చెప్పి చిన్న మొత్తం కాదు 10,000 రూపాయలు చేతిలో పెట్టి, మీరు ఏదో కష్టంలో వున్నట్లు నాకు అనిపిస్తుంది. ఇది మీరు బ్యాంకులో డిపాజిట్ లాగా వేసుకోండి. దీని నుండి వచ్చే వడ్డీని దానిని మీరు వాడుకోవచ్చు. మాకు కళ్ల వెంట నీరు కారింది. వారి ప్రేమ, ఆప్యాయతలతో సంతోషంగా మా కంట కన్నీరు వచ్చాయి.

కాని తర్వాత కె.ఎస్. గారి సత్సంగాల్లోకి, మనసు పూర్తిగా అంకితం అయిపోయింది. గుడికి వెళ్లాం అక్కడ ఏదో శబ్దం భజనలకు వెళ్ళినా అక్కడ ఏదో శబ్దం. ఇక్కడకు వస్తే ఆనందం, ప్రశాంతత, మౌనం అన్నీ దొరుకుతాయి. ఇది నా అనుభవం. కె.ఎస్. గారు వారి భాషణల్లో అప్పుడప్పుడు రామాయణంలో వ్యక్తుల గురించి, భాగవతం గురించి, ఆదిశంకరులు చెప్పిన విషయాలను ఎన్నో చెప్పేవారు. దానితో సాధకులు ఎంతో లబ్ధి పొందేవారు.

రోజులు అలా గడుస్తున్నాయి. నాకు ఉద్యోగం లేదు, ఏదో ఒకటి చేయాలి అని ధర్మబద్ధంగా వుండాలి ఎలాంటి పక్కదారుల్లోకి వెళ్ళకూడదు. రమణ మార్గంలో వున్నాము పస్తులు వున్నా ఫర్వాలేదు కానీ ప్రక్కవాడిని 10 రూపాయలు అడుగరాదు అనే ఆలోచనలో వుండేవాళ్ళం.

ఇంతలో మా ఆడవారికి లోన్ తీసుకొని ఏదో ఒక వ్యాపారం చేద్దాం. అనుకొని బ్యాంక్‌కి వెళ్ళటం జరిగింది. వారు ఇస్తామన్నారు పచ్చళ్ళ వ్యాపారం మొదలుపెడదాం. అది బాగా అభివృద్ధిలోకి వచ్చింది. బాగా ఎదుగుతుంది అనుకున్నాం. మా ఆఫీసు ఇంక మూసి వేసే సమయంలో ఒక చిన్న పనిబడింది అంటూ చిత్తూరులో పని వుంది వెళతావా అన్నారు మా ఆఫీసర్. నాకు లా చదువుతో పరిచయాలు వున్నాయి. నీకు హెల్ప్ చేస్తాను అని చెప్పారు. చిత్తూరు వెళ్ళమని చెప్పినపుడు నాకు యాదయ్య గారిని అరుణాచలం ఎలా వెళ్ళాలి అని అడిగాను. వారు చెప్పారు. ఆఫీసు అయిపోయాక వెళ్ళాను అక్కడికి చేరుకొనే సాయంత్రం అంటే అప్పటికే అన్ని పారాయణం, అంతా అయిపోయింది. అక్కడ ఒక దగ్గర ఆగి నేను హైదరాబాద్ రమణకేంద్రం నుండి వచ్చాను. నాకు రెండు రోజులు ఉండటానికి అవకాశం ఇవ్వండి అని అడిగాను. కానీ వారు లేదనటం జరిగింది. అప్పుడు అనుకోకుండా వెంకట రామన్ గారు కనిపించారు. నేను కె.ఎస్. గారి ఇంటికి వచ్చినపుడు వారిని చూడటం జరిగింది. వారితో ఇలా వచ్చాను అని చెపితే వారు వెంటనే ఎవరినో పిలిచి గది ఇవ్వమనటం జరిగింది. అలా

భగవాన్ కృప మొదటగా చూపించారు. ఆ విధంగా రెండు రోజులు చాలా తొందరగా అయ్యాయి. గిరి ప్రదక్షిణం చేసి వచ్చాను. ఈ లోపులో మా ఆడవారికి చాలా బాధ కలిగింది. వారు భగవాన్‌తో నేరుగా మాట్లాడేవారు. ఏ కష్టం వచ్చినా భగవాన్‌తో చెప్పుకునేవారు.

మా వ్యాపారం బాగానే సాగేది కానీ మా వద్ద డబ్బులు వుండేవి కావు. భార్య భగవాన్ని చూస్తున్నారా చూడండి. అంత పెద్ద కళ్ళు వున్నాయి కదా చూడండి అంటూ వుండేవారు. మేము 100 కిలోలు, రకరకాలు పచ్చళ్ళు పెట్టేవారం చేసిన తర్వాత అన్నింటి మీద కొంత విభూతి పడేసేవాళ్ళం. అంతా బాగుండేది అన్నీ ఆ భగవాన్ చూసుకునే వారు, భగవాన్ చూసుకుంటున్నారు అని అనటానికి కారణం రుచి అంత బాగా వచ్చేది. ఆ తర్వాత నేను ఒక టైపురైటర్ కొనుక్కున్నాను ఏదో ఒక పని వుంటే చేయవచ్చు అని. కె.ఎస్. గారిని అడిగాను ఏదైనా పని వుంటే, చేసిపెడతాను. వారి వద్ద కొంత బిట్వీన్ యు అండ్ మీ శీర్షిక కోసం కొంత పని చేయటం జరిగింది. అయితే భార్య నన్ను బాధతో మీరు అరుణాచలం వెళ్ళారు నన్ను మాత్రం తీసుకొని వెళ్ళ లేదు అని బాధపడ్డారు కూడా.

మహా శివరాత్రి నాడు. భార్యకు అంతకు ముందు అనారోగ్యం మొదలైంది. కాని ప్రభుత్వ ఆసుపత్రిలో వద్దు కార్పొరేట్ ఆస్పత్రిలో చేరతాను అని భగవాన్‌తో చెప్పుకుంటే అది తీర్చారు. తనకు కామెర్లు వచ్చాయి, చాలా తొందరగా వ్యాధి ముదిరింది. ఆ రోజు శివరాత్రి

ఆమె దగ్గరకు వెళ్ళి చెప్పాను. లలితా సహస్ర పారాయణం, విష్ణు సహస్ర నామ పారాయణం చేయమనింది. చేయడం జరిగింది. ఆమె నాకు మేనకోడలు అవటం వల్ల నన్ను మామయ్య అని పిలిచేది ఉన్నంత కాలం. అక్షర మణిమాల పారాయణం జరిగేది, అప్పుడు ఆమె ఉన్న స్థితి చూసి చాలా బాధ అనిపించేది. కానీ ఏం చేయలేని పరిస్థితి. డాక్టర్ అప్పటికే ఆమె బ్రతకటం కష్టం అన్నీ భాగాలు పాడయిపోయాయి. నా వల్ల కాదు ఇంటికి తీసుకుని వెళ్తాం అని చెప్పాము. బాడీ వీక్‌గా అవుతుంది కానీ మాత్రం ఆమె మామూలుగానే మాట్లాడుతుంది అని డాక్టర్ చెప్పారు తీసుకుని వెళ్ళమని. తనకి చెప్పాము అరుణాచలం నామస్మరణ చేస్తున్నాను సుందరి ఇంక వెళుతున్నాము అన్నాను. అలా అరుణాచల నామస్మరణతో తను ప్రాణం విడిచింది. ఆ రోజు శివరాత్రి కావటం చాలా విశేషం. నా భార్య చనిపోయినపుడు కేంద్రం భక్తులు అందరూ చాలా సహాయం చేశారు. నా పిల్లలు అందరూ చాలా బాగా సెటిల్ అయ్యారు. (As told to Smt. Kala garu)

# గణపతి నోట మాతంగి విద్య

రేణుక అయ్యల సోమయాజులు

తార, సరస్వతుల అంశకు చెందినటువంటి దైవము మాతంగి యని తెలుయుచున్నది. ''మాతంగి'' దశమహా విద్యలలో తొమ్మిదవది. వాక్కు నాలుగు విధములు:

పరావాక్కు: ఈశునికి చెందినది. ఉత్పాదనకు ముందున్న శబ్దశక్తి. మూలాధారము కేంద్రము. అధిదేవత త్రిపురభైరవి.

పశ్యంతి వాక్కు: దృశ్య రూపము దాల్చినది. కేంద్రము మణిపూరక చక్రము. అధిదేవత తారాదేవి.

మధ్యమ వాక్కు: నాభీస్థానము కేంద్రముగా గలది. అవ్యక్తముగా నుండి వ్యక్తి యొక్క గ్రహణోపాధిని బట్టి వ్యక్తమగు చుండును.

వైఖరి వాక్కు: ఇంద్రియ సంబంధముతో వ్యక్తమై భాషారూప శబ్దముగా లోకమునందు పరస్పర అవగాహనకు తోడ్పడునది. అధిదేవత మాతంగి.

ఆరాధ్య రూపము: మాతంగి త్రిపురభైరవి సంబంధముచే సుందరమైన రూపము కలది. నీలచ్ఛాయ గల శరీరం, శుభమైన ముఖం. అందు మరకత మణుల వంటి కాంతి ఛాయల ప్రభా వీచికలు, విశాలమైన నుదురు, అభయముద్ర గల చేతులు గల్గి మోహినివలె అతి సుందరముగా వుంటుంది ఈమె. చేతులలో వీణ, ఈమె సంగీత నిధియని తెల్పుతుంది. రత్న సింహాసనంపై కూర్చుంటుంది. కావున మాతంగి ఉపాసకుల వాక్కు అతి

మధురంగాను, సంస్కార యుతంగాను, జ్ఞానాన్ని పెంచేవిగాను వుంటాయి.

మంత్రఫలము: విద్యయే భాష. గణపతి దానికి అధికారి. శ్రీ రాజరాజేశ్వరీ దేవి యొక్క కొలువులో మాతంగిని "మంత్రిణి" అని పేర్కొన్నారు. లలితాసహస్రంలో చెప్పినట్లు చక్కని సమాలోచనములతో రాజ్యాన్ని పాలించుటకు మంత్రి రాజునకు ఉపకరిస్తాడు. బహుశః మాతంగికి అటువంటి చాతుర్యం ఉండి వుండవచ్చు. అదీ కాకుండా తన ద్వారా మంత్రోపాసకులను రక్షిస్తుంది లలిత. ఐశ్వర్యం, సుకవిత్వం, వాక్శుద్ధి, సర్వసిద్ధి, బ్రహ్మ జ్ఞాన ప్రాప్తి, కైలాసప్రాప్తి ఇవన్నీ కూడ మాతంగి యొక్క మంత్రఫలములు. అమ్మ సంపూర్ణంగా గణపతి మునికి ఇచ్చినది ఇదే.

విందామహే మహాదేవం యస్యవిందారవో జనాః ।
నవిందతి పునర్మాతుః కుచకుంభ పయోరసమ్ ॥

(ఎవరికి నమస్కరించి జనులు తల్లి పాలను త్రాగుటకు మరల జన్మించిరో అట్టి మహాదేవునకు నా నమస్కారములు)

సాహితీ తపస్సీమలో విద్యాభ్యాసమొక సాధనా ప్రక్రియ మాత్రమే. ఇందు సంపూర్ణ ఫలము నొందు సాధకులు బహు తక్కువ. కేవలము శాస్త్ర పరిచయముతోను, డిగ్రీ పొందుట వలనను విద్య పరిపూర్ణము కాజాలదు. తనకంటు ఒక శైలి, విమర్శనాత్మక దృష్టి, స్వతంత్ర భావన, గమనము, భాషపై అధికారము మొదలగునవి పరిపూర్ణుడైన విద్యార్థి యందు కనబడే లక్షణములు.

14 సంవత్సరముల వయస్సు నిండక మునుపే పంచ

కావ్యములను ముగించిన గణపతి చంపూ రామాయణము, శాకుంతలము, ఉత్తర రామ చరిత్రము, కువలయానందనము, చంద్రాలోకము, ప్రతాప రుద్రీయము ఇత్యాది శ్రేష్ఠమైన గ్రంథములను చదివి ముగించినవాడై, సంస్కృత భాషపై అధికారమును సంపాదించి, తనకంటూ ఒక ప్రత్యేక శైలిని అలవరచుకొని పండిత ప్రశంసల నొందెను.

దేశ కాల పరిస్థితుల ననుసరించి కవితా దృష్టి మారవలయు నను అభిప్రాయము గణపతికి బాల్యము నుండి గలదు. ఇటువంటి అభిప్రాయముతోనే తన 14వ ఏట కవితా ప్రవచనము నందు గణపతి చేసిన సవాల్ ఇది.

ఇహకేషాంచి దేషాచేన్న సంతోషాయ కాంక్షతిః ।
కిమానందాయ కాకానాం బాలకోకిల కాకలీ ॥

(నా ఈ వాణి కొందరల్పజ్ఞులకు సంతోష మీయనిచో నాకేమి నష్టమున్నది? కాకులకు ఆనందమగునని బాలకోకిల ధ్వనిచేయునా?))

ఎవరో తప్పు పట్టారని గణపతి పలికిన వాక్కులు కావివి. ఇందు అతని స్వతంత్ర దృక్పథం, విప్లవాత్మక దృష్టి కానవస్తున్నవి. పురాణేతిహాసములలో గల అనౌచిత్యాన్ని బాహాటంగా చెప్పగలిగిన ధైర్యం ఈ మహాకవికి కలిగిందంటే బాల్యమునుండి అతనికిగల స్వతంత్ర భావన, సమాజం పట్ల సేవాదృష్టి అని చెప్పక తప్పదు. అంతేకాదు భారతీయుల సంస్కృతి సంరక్షణ, వేదభాషయైన సంస్కృతమును రాజభాష గావించుట ద్వారా జరుగునని తన అభిప్రాయమును కాంగ్రెస్ మహాసభల యందు గాంధీ మహాత్మునితో విన్నవించగా అతను కొందరికే తెలిసిన ఈ భాష

యెటుల రాజభాష గావించగలమని ప్రశ్నించెనట. అందుకు గణపతి సంస్కృత భాషను సంస్కరింప బూని, దానిని సులభతరం జేసి అందరికీ అందుబాటులో నుండునట్లు "లాలాభాస" యను పేరిట వ్రాసి ఆశ్చర్యచకితులను చేసెను. ఇది అతని సాహసమునకు నిదర్శనము.

మహాకవి కాళిదాసు, ఆదిశంకరులు - వీరి ప్రభావము గణపతి రచనలలో కానవస్తుంది. కమనీయమైన కావ్యాలను అందజేయటమే గాక గంభీరమైన ఆధ్యాత్మిక జీవనాన్ని ఇతడు ఆదిశంకరుల మార్గంలోనే ఆచరించాడని చెప్పక తప్పదు. ఈ ఇరువురు మహాపురుషులు గణపతికి అత్యంత ప్రియులనుటకు ఈ దిగువ శ్లోకములు నిదర్శనములు.

కాళీకటాక్షో వచనాని మహ్యం దదాతు మోచామద మోచనాని।
యత్పాత పూతం రఘువంశకారం నరాకృతిం ప్రాహురజస్య నారీం ॥

(యే కటాక్ష ప్రాప్తి చేత పవిత్రుడగు కాళిదాసుని నరాకృతి యగు సరస్వతియే యని పండితులు చెప్పుదురో, ఆ కాళీ కటాక్షము వచనములను నాకొసగు గాక)

కృపావలోకో నగకర్యకాయాః కరోతుమే నిర్మల మంతరంగమ్।
యేనాంకితః శంకర ఏకతత్త్వం విశ్వంలులోకే జగతే జగౌచ॥

( ఏ కృపావలోకనమున, అంకితుడగు శంకరుడు సమస్తమును ఏకతత్త్వముగా కనుగొని తన దర్శనమును లోకమునకుపదేశించెనో ఆ నగకన్య కృపావలోకనము నా యంతరంగమును నిర్మలమొనర్చు గాక)

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# శ్రీరమణ మహర్షి యొక్క భక్తాగ్రేసరులు

# శ్రీ ఎన్. రామచంద్ర రావు

**మల్లాది ఫణిమాల**

శ్రీ రమణుల చెంతకు జ్ఞానమును కాంక్షించి కొందరు, మనశ్శాంతి కోసం మరికొందరు... ఇలా ఉర్వి నలుమూలల నుండి అన్ని వర్గాల వారు ఆధ్యాత్మిక ప్రగతిలో వివిధ స్థాయిల వారు వచ్చారు. నిజానికి అందరికీ వారు సులభులే. సంసార సాగరంలో ఈదులాడి, విసిగిపోయి, డస్సిపోయి, ఉపశమనం మరియు ప్రశాంతత కోసం ఎందరో భక్తులు వారిని ఆశ్రయించారు. వీరిలో కొందరు యథాలాపంగా వస్తే మరికొందరు వారి వద్దకు ఏదో ఒక ఆశతో వచ్చారు. శ్రీరమణులు తమ కరుణామయ వీక్షణంతో వారందరికీ అంతులేని మనశ్శాంతిని కృప చేశారు.

వారందరికీ హృదయం లోనికి దారి చూపారు. దక్షిణామూర్తిగా ఈ యుగపు జ్ఞాన - గురువులుగా పూజలందుకుంటున్న శ్రీ రమణ మహర్షుల వారి భక్తాగ్రేసరులలో ఒకరైన శ్రీ ఎన్. రామచంద్ర రావు గారు కన్నడ భాషలో శ్రీరమణ జీవిత చరిత్రను మొట్టమొదటిసారిగా వ్రాసిన మహనీయులు. శ్రీఎన్. రామచంద్ర రావు గారు ఏరేగాంలో ఉపాధ్యాయ వృత్తిలో ఉండేవారు. వీరు బడిపంతులుగా పనిచేసి రిటైర్ అయ్యారు. విశ్రాంతి కోసం బెంగళూరుకు వెళ్లి అక్కడ స్థిర పడ్డారు. శ్రీ ఎన్. రామచంద్ర రావు గారు 1918వ సంవత్సరంలో మొదటిసారిగా శ్రీ రమణుల గురించి విని తెలుసుకొని వెంటనే వారి దర్శనార్థమై అరుణాచలం వెళ్లారు.

ఆ రోజుల్లో శ్రీ రమణులు స్కందాశ్రమంలో ఉండేవారు. అరుణాచలంలో అడుగుపెట్టీ పెట్టగానే అరుణగిరి ఎక్కి స్కందా శ్రమం చేరుకొని, వీరు శ్రీరమణులను దర్శించుకున్నారు. మహోన్నతమైన మనోతీతమైన స్థితిలో నిష్ఠులై ఉన్న శ్రీ రమణులను దర్శించుకుని త్రిగుణాతీతులైన శ్రీ రమణులను వారి సద్గురువు లుగా స్వీకరించారు శ్రీ రామచంద్ర రావుగారు. శ్రీ రమణ దర్శనము, వారి మనోహరమైన పలకరింపు రామచంద్ర రావుగారిని ఎంతగానో ఆకట్టుకున్నాయి. శ్రీ రమణులు వారి ఊరు పేరు అడిగి మరీ తెలుసుకొని శ్రీ రామచంద్రరావు గారిని ఆశ్రమంలో భోజనం చేయమని ఎంతో ఆప్యాయంగా ఆహ్వానించారు. ఇట్టి శ్రీ రమణ వాత్సల్యం మరియు ఆతిథ్యం మాటలలో వర్ణించలేనంతగా రామచంద్రరావు గారిపై ముద్ర వేశాయి.

తొలి దర్శనం మొదలుకొని శ్రీ రమణుల మహాసమాధి వరకు వీలైనప్పుడల్లా అరుణాచలం వెళ్లి రామచంద్రరావు గారు శ్రీ రమణుల దర్శనం చేసుకుంటూనే ఉండేవారు. రామచంద్ర రావు గారు మొదటిసారి శ్రీ రమణులను దర్శించుకున్న కొద్ది నెలలలోనే వారి భార్యని మహర్షి దర్శనార్థమై అరుణాచలం తీసుకువెళ్లారు. భక్తులపైనే కాకుండా వారి కుటుంబ సభ్యులందరిపై కూడా అవ్యాజమైన కరుణను వర్షించేవారు, శ్రీరమణులు. పొరుగూరు నుండి వచ్చిన ఏ భక్తులనైనా, వారి కుటుంబ సభ్యుల బాగోగులు సైతం అడిగి, ఇంటి వద్దనున్న అందరి క్షేమ సమాచారము అడిగి మరీ తెలుసుకునేవారు శ్రీ రమణులు. వారి వాత్సల్యం గురించి నిజానికి ఎంత చెప్పినా, వ్రాసినా తక్కువే మరి !!

రామచంద్ర రావుగారు, భార్యని తీసుకుని అరుణాచలం వెళ్లి రమణుల సన్నిధానాన కూర్చోగానే, శ్రీ రమణులు రామచంద్ర రావు దంపతులను ఒక గట్టుమీద కూర్చోబెట్టి, ఎంతో ప్రేమతో స్వయంగా తమ దివ్యహస్తాలతో వారిరువురికి భోజనం వడ్డించడమే కాకుండా వారివురు భోజనం చేస్తున్నంత సేపు వారిపై అమితమైన కృపను వర్షించారు. ఆనాడు శ్రీ రమణులు భోజనం వడ్డించిన తీరు యొక్క మాధుర్యాన్ని ఎంత స్తుతించినా తక్కువేనని శ్రీ రామచంద్ర రావుగారు అన్నారు.

రామచంద్ర రావుగారి భార్య తరచూ అనారోగ్యం పాలవుతూ సరిగ్గా వేళకి ఆహారం తీసుకోలేకపోయేవారు. ఎందరెందరో వైద్యులను సంప్రదించి రామచంద్ర రావుగారు మరియు వారి భార్య - ఇద్దరు అలసిపోయారు. కొంతకాలానికి వైద్యులు ఆమెకి క్షయ రోగం ఉందనీ, ఈ దిశగా వారు ఏమీ చేయలేమని తేల్చి చెప్పేశారు. సద్గురువు నయం చేయలేని రోగం ఏముంటుంది!! ఒకనాడు శ్రీ రమణులు ఆమెకు కలలో దర్శనమిచ్చి ఆశీర్వదించారు. అటుపై ఏ వైద్య సహాయం లేకుండానే శ్రీ రామచంద్ర రావు గారి భార్యకు క్షయరోగం నయమైపోయింది. రామచంద్ర రావుగారు, వారి కుటుంబ సభ్యులందరూ ఈ అద్భుతాన్ని చూసి ఆశ్చర్యపోయారు! ఈ విధంగా గురు రమణులను నమ్ముకున్న వారి జీవితాలలో ఎన్నెన్నో అద్భుతాలను మనం చూడవచ్చు. శ్రీకృష్ణ పరమాత్మ గోవర్ధన పర్వతాన్ని తన చిటికెన వేలుపై ఎత్తి ఏ విధంగా అయితే భక్తులకు రక్షణ కల్పించాడో, అదే విధంగా జ్ఞాన గురువులైనటువంటి శ్రీ అరుణాచల రమణులు తమను నమ్ముకున్న భక్తుల ఇంట కామధేనువై, కల్పవృక్షమై సదా వారిని రక్షించి కాపాడుతారు అని అనడానికి ఇటువంటి ఉదాహరణలు ఎన్నెన్నో కలవు.

ఒకరోజు సాయంత్రం శ్రీ రామచంద్ర రావు గారికి, వారి భార్యకి శ్రీరమణుల పాదపూజ చేయాలనేటటువంటి కోరిక కలిగింది. కానీ శ్రీరమణాశ్రమ నియమానుసారము అది సాధ్యం కాని పని అని వారికి తెలుసు. హృదయంలో కలిగిన కోరికను ఎవరితోనూ చెప్పు కోక శ్రీరమణుల సన్నిధిలో మౌనంగా కూర్చుండిపోయారు. ఆ దంపతుల పట్ల అవ్యాజమైన కరుణతో శ్రీ రమణులు ఆ కోర్కె నెరవేరేటట్లు చేశారు. వారి సన్నిధాన కూర్చున్న వాళ్ళంతా ఎవరి దారిన వాళ్ళు కాసేపటికి వెళ్ళిపోయారు. అప్పుడు శ్రీ రామచంద్ర రావుగారు, వారి భార్య - ఇరువురు మనసారా శ్రీ రమణులకు పాద పూజ చేసుకోగలిగారు. "భక్తితో కొలుచుకున్న వారికి కొలుచు కున్నంత అభయం" అని ఈ విధంగా శ్రీ రమణులు భక్తలోకానికి తెలియచెప్పారు.

1923వ సంవత్సరంలో శ్రీ రమణుల దర్శనార్థమై రామచంద్ర రావు గారు మళ్లీ అరుణాచలం వెళ్ళినప్పుడు పునః పాదపూజ చేయటానికి అనుమతి కోరారు. కానీ శ్రీ రమణులు నిరాకరించారు. ఎందుచేత అనగా ఇటువంటి సాంప్రదాయ సిద్ధమైన పూజలను వారు వారించేవారు. ఎప్పటికప్పుడు దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య ఎక్కువ అవుతూ ఉండడం వల్ల కాబోలు అని శ్రీ రామచంద్ర రావు గారు వారికి వారే సర్ది చెప్పుకున్నారు. అంతేకాదు, శ్రీ రమణులు తమ భౌతిక దేహానికి ఏ విధమైన పూజనైనా వ్యతిరేకించే వారు అన్న సంగతి మనందరికీ తెలుసు.

ఇలా శ్రీ రమణుల సాన్నిధ్యంలో కాలం గడిపే భక్తులు నిజంగా ధన్యజీవులు....

# Be a Dheera

Talk 37

Dr K Subrahmanian

One of the things that we all seek is peace of mind. Without exception, everybody wants peace, and we try different methods to experience it. We read books, go to temples, go on pilgrimages, visit *sadhus*, saints and sages, meditate, do *puja* and *japa*, and other similar things. Most of us believe that we can have peace of mind by doing these things. What we must remember is that we cannot buy *shanthi* or peace with money, or with anything else for that matter. All of us are seeking something which can be had only from within, and not from without. *Shanthi* is not something that is out there, it comes from within. Unfortunately, not all of us experience it even on a temporary basis.

Is there a connection between our day-to-day work and peace of mind? Very often, we tell ourselves that it is the nature of our work that prevents us from having peace of mind. We wrongly believe that it is easier for those who are away from society to experience this peace. Like us, the society that we are a part of is also unhappy. We attempt to overcome this unhappiness by trying to forget ourselves in various things. In other words, all our daily activities are aimed at taking the mind away from itself. At the end of the day, after having indulged in some of the activities, we find that we're mentally tired. If we had been physically tired, we could have overcome the problem

with a ten-minute sleep. But when we are mentally tired, the mind is so restless or agitated that it doesn't allow us to sleep. The doctor we consult says that tension is the cause of all our problems - it's what is preventing us from sleeping. He, therefore, prescribes sleeping tablets to quieten the mind. That night, after taking the tablets, we sleep well and wake up refreshed.

What happened to our agitated mind in deep sleep? It merged in the heart. If we have a lot of dreams while sleeping, we call it disturbed sleep. The mind in its subtle form is restless; it's only when the mind is completely merged in the heart that we experience deep sleep. We call dreamless sleep, peaceful sleep. When the mind remains active, even in our sleep, we have dreams. Because we dream every day, we do not pay attention to this extraordinary thing called dreams. Almost everyone dreams, but nobody truly understands why we do. Why do we dream the way we do? When the mind becomes agitated on account of the dreams, we wish we didn't experience such dreams. Not all dreams, however, are bad; sometimes, we have pleasant dreams, and they leave us feeling happy.

We see with our eyes, and we also see without our eyes; we imagine many things.

*vishvam darpana-drshyamaana-nagari tulyam nijaantargatam*
*pashyannaatmani maayaya bahirivodbhutam yathaa nidrayaa* |

*yassaaksaatkurute prabhodhasamaye svaatmaaname vaadvayam*
*tasmai srigurumurtaye nama idam sri daksinaamurtaye* ||

